

వెదురుతో ఆదరువు

వెదురుకర్రతో తయారు చేసిన బుట్టలు అందరికీ తెలిసినవే. వెదురు కర్ర తట్టల గురించి చెప్పనక్కర్లేదు.

-8లో



ప్రభుత్వరంగంలోనే పరిరక్షణ

ప్రభుత్వ రంగంలోనే బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్టంగా ఉంటుందని, ఏఐబీఈఏ, బ్యాంక్స్ ఎంప్లాయీస్ కో ఆర్డినేట్ కమిటీ సభ్యులు అన్నారు.

-8లో

నేడు శంబర చేరుకోనున్న పోలమాంబ

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ జాతరకు సోమవారం చినపోలమాంబ అమ్మవారి విగ్రహాన్ని మేళతాళాలతో చదురుగుడికి ఆలయ నిర్వాహకులు తీసుకురానున్నారు. చదురుగుడిలో అమ్మవారు కొలువై భక్తులకు దర్శనమిస్తారు. ఈ నెల 23న అమ్మవారికి తొలేళ్ల ఉత్సవం, 24న సిరిమానోత్సవం, 25న అంపకోత్సవం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 1258 పనులకు రూ.28 కోట్లు

- త్వరితగతిన అభివృద్ధి పనులు
- జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి రామచంద్రరావు



కె.రామచంద్రరావు

పార్వతీపురం టౌన్‌: త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి కె.రామచంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను జీఎస్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నివేదికలను పంపించామని పేర్కొన్నారు. జిల్లాలో 1258 పనులకు రూ.28కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వాటి నిధులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. గ్రామాలు, పట్టణాలలో తాగునీటి సమస్యల పరిష్కారానికి, తాగునీటి సరఫరాకు, నీటి నిల్వ చేసే ట్యాంకు నిర్మాణానికి, సురక్షిత మంచినీటికి తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. రహదారుల అభివృద్ధి సీసీ, బీటీ రహదారుల నిర్మాణం, మరమ్మతులకు నిధులను కేటాయించారన్నారు. గ్రామాలలో కాలువల నిర్మాణం, విద్యుత్ సరఫరా, విద్యుత్ స్తంభాలు ఆధునీకరణ పనుల నిమిత్తం గ్రామ స్థాయిలో అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు.

తాలాడలో గజరాజులు



తాలాడ - అత్తికొత్తూరు రోడ్డుపై గజరాజులు

భామిని: మండలంలోని తాలాడలో గజరాజులు ఆదివారం హల్‌చల్ చేశాయి. నదీతీరంలోని తోటల నుంచి బయటకు వచ్చిన నాలుగు ఏనుగుల గుంపు నేరుగా తాలాడ రోడ్డుపై ప్రయాణించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అత్తికొత్తూరు వెళ్లే రహదారిలో రాకపోకలకు ఆటంకం కలిగించాయి. ప్రజలు వెంటబెట్టడంతో గజరాజులు పంట పొలాల్లోకి ప్రవేశించి ధ్వంసం చేశాయి. ఈ విషయం అటవీ శాఖాధికారులకు స్థానిక నేతలు సమాచారం ఇచ్చారు. రైతులకు కలుగుతున్న నష్టాలను ఉన్నతాధికారులకు తెలియజేయాలని కోరారు.

చంద్రబాబు, పవన్‌ల దొంగాట

- ప్రజలు గమనిస్తున్నారు...
- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల దొంగాటలను ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినపుడు తగిన బుద్ధి చెబుతారని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పాచిపెంట మండలంలోని గురివినాయుడుపేటలో విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడారు. వీరిద్దరూ ముసుగు దొంగలని మరోసారి స్పష్టమైందన్నారు. చంద్రబాబు తన ప్రచార ఆర్భాటాలకు ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు. సైకిల్ పోవాలంటూ చంద్రబాబే ప్రజల మనసులోని మాటను తన మాటగా చెప్పారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ప్రాణ రక్షణకు జీఓ నంబరు 1 తీసుకువస్తే లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలు నిర్మాణాత్మక పాత్ర పోషించాలని సూచించారు. గతంలో చంద్రబాబు, బాలకృష్ణ, టీడీపీ వర్గీయులను సైకోలన్న పవన్‌కల్యాణ్ నేడు మళ్లీ వారితో వెళ్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్టు చంద్రబాబుకు దత్తపుత్రునికిగా పవన్‌కల్యాణ్ వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదాలు పుష్కలంగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డిని ఎదిరించే వాడు ఎవరూ లేరని అన్నారు. ఇటీవల జరిగిన సర్వేల్లో ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని స్పష్టం చేశాయన్నారు. సింహం సింగిల్‌గానే వస్తుందన్నారు. ప్రజల ఆశీర్వాదంతో జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని చెప్పారు.

అన్నదాతకు వెన్నుదన్ను



మిల్లుల వద్ద ధాన్యం నిల్వలు

అన్నదాత కష్టానికి ఫలితం దక్కుతోంది. ఖరీఫ్ ధాన్యం దిగుబడులు కొనుగోలు విషయంలో ప్రభుత్వం తెచ్చిన కొత్త విధానంతో దళారుల అక్రమాలకు చెక్ పడింది. దీంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కుతోంది. మరోవైపు ధాన్యం డబ్బులు కూడా ప్రభుత్వం ప్రకటించిన 21 రోజుల గడువులోగే రైతుల ఖాతాల్లో జమవుతున్నాయి. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- ధా న్యం కొనుగోలులో దళారుల జోక్యానికి చెక్
- దక్కుతున్న మద్దతు ధర
- గడువుకు ముందే అందుతున్న సొమ్ము
- జిల్లాలో 1.49 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి
- ఇప్పటికే రూ.76 కోట్ల చెల్లింపు

పార్వతీపురం మన్యం జిల్లాలో కొనుగోలు వివరాలు..

ధాన్యం కొనుగోలు కేంద్రాలు	188
రైతుభరోసా కేంద్రాలు	366
ధాన్యం సేకరణ లక్ష్యం	1.91 లక్షల మెట్రిక్ టన్నులు
సేకరించిన ధాన్యం	1.49 లక్షల మెట్రిక్‌టన్నులు
మిల్లర్ల వద్ద రశీదులు జనరేట్ అయినవి	రూ.212 కోట్లు
రైతులకు చెల్లించిన మొత్తం	రూ.76 కోట్లు
బ్యాంకు నుంచి చెల్లింపులు జరగాల్సినవి	రూ.136 కోట్లు
గోనె సంచులకు చెల్లించిన మొత్తం	రూ.8.17 లక్షలు
రవాణాకు ఏజెన్సీలకు చెల్లించిన మొత్తం	రూ.30 లక్షలు

పార్వతీపురం టౌన్‌: ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విధానం దళారుల జోక్యానికి పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేసింది. గతంలోనూ ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసేది. అయితే రైతులు తమకు తెలిసిన కమిషన్ ఏజెంట్లు, మిల్లర్ల వద్దకు ధాన్యం తీసుకువెళ్లేవారు. ఇది దళారుల జోక్యానికి వీలు కల్పించింది. కొనుగోలు కేంద్రంలో నిర్ధారించిన తేమ శాతం సరిగా లేదనో.. ఎక్కువ ఉందనో.. పొల్ల గింజలు ఎక్కువ ఉన్నాయనో.. ఇలా రకరకాల కారణాలతో ఆ దళారులు ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేవారు కాదు. మద్దతు ధరలో ప్రతీ బస్తాకు రూ.50 నుంచి రూ.100 వరకు కోత పెట్టేవారు. తద్వారా ఆయా రైతులు ఎకరాకు రూ.2,400 నుంచి రూ.3,300 వరకూ నష్టపోయేవారు. దీనికి తోడు ప్రతికూల వాతావరణంలో రైతుల ఆందోళనను ఆసరా చేసుకుని దళారులు ధర మరింతగా తగ్గించేవారు. దీంతో అధిక శాతం రైతులు ఏం చేయాలో పాలుపోక అయినకాడికి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండేది. రైతుకు, దళారీకి మధ్య ముందుగా కుదిరిన ఒప్పందం మేరకు ధ్యాన్యం బస్తాలను తగ్గించి, మిగిలిన వాటిని కొనుగోలు కేంద్రంలో ఆన్‌లైన్ చేయించేవారు. ఆన్‌లైన్ అయిన ధాన్యానికి మాత్రమే ప్రభుత్వం సొమ్ములు చెల్లించేది. తగ్గించిన బస్తాల సొమ్ము దళారుల పాలై పూర్తి మద్దతు ధర అందక రైతులు నష్టపోయేవారు.



మిల్లుకు తరలిస్తున్న ధాన్యం

రైతుల కష్టం దళారుల పాలవ్వకుండా..

రైతుల కష్టం దళారుల పాలవ్వకుండా, ఏ దశలోనూ వారి జోక్యానికి ఆస్కారం లేకుండా ప్రభుత్వం ఈసారి కొనుగోలు నిబంధనలను కఠినం చేసింది. కొత్త నిబంధనల మేరకు సొసైటీకీ రైతు ధాన్యం శాంపిల్ తీసుకువెళ్తే చాలు.. అక్కడి కొనుగోలు సిబ్బంది తేమ శాతం నిర్ధారిస్తారు. ఈ - క్రాప్ నమోదుకు లోబడి ఎన్ని టన్నుల ధాన్యం పంపించేదీ ఆన్‌లైన్ చేయగానే ఏ మిల్లుకు తరలించాలో కంప్యూటర్ సూచిస్తుంది. ఆ మిల్లుకు మాత్రమే ధాన్యాన్ని తరలించాలి. అందుకయ్యే రవాణా ఖర్చులను ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈ నూతన విధానంపై మొదట్లో అవగాహన లేక కొంత గందరగోళం నెలకొన్నప్పటికీ.. పండించిన ధాన్యానికి పూర్తి మద్దతు ధర దక్కడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు సగటున 33 బస్తాల దిగుబడి వస్తుండగా, వివిధ సాకులతో రూ.3,300 వరకూ ఆదాయం కోల్పోయే వారమని, ఇప్పుడు పూర్తి మద్దతు ధర దక్కుతోందని, గతంలో కోల్పోయిన సొమ్ము ఈసారి ఆదా అవుతోందని రైతులు చెబుతున్నారు.

కొత్త విధానం రైతులకు ఉపయోగకరం



ధాన్యం కొనుగోళ్లలో కొత్త విధానం మా లాంటి రైతులకు ఎంతో ఉపయోగకరం. గతంలో ఏదో ఒక కారణంతో బస్తాకు ఎంతో కొంత కోత వేసేవారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో పూర్తి మద్దతు ధర అందడంతో ఎకరాకు రూ.2,500పైగా అదనపు ఆదాయం కనిపిస్తుంది.

– వంగపండు శంకరరావు, రైతు, పార్వతీపురం

దళారుల జోక్యానికి చెక్



ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త విధానంలో దళారుల జోక్యానికి పూర్తిగా బ్రేక్ వేయడం వలన రైతులకు న్యాయం జరిగింది. 21 రోజుల వరకూ ఎదురు చూడకుండా రైతులకు ముందే ధాన్యం డబ్బులు చెల్లింపునకు చర్యలు చేపట్టాం.

– దేవ్లన్ఖనాయక్,
పౌర సరఫరాల జిల్లా మేనేజర్, పార్వతీపురం మన్యం

పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తున్నాం..



రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటి వరకు జిల్లాలో 1.49 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించాం. రైతులకు రూ.76 కోట్లను గడువుకు ముందే అందించాం. రూ.136 కోట్లు బ్యాంకు నుంచి త్వరితగతిన చెల్లింపులు చేసేందుకు చర్యలు చేపట్టాం. గోనె సంచులు, రవాణా చేసేందుకు అయ్యే రవాణా ఖర్చులను సైతం చెల్లిస్తున్నాం. ఇచ్చిన 21 రోజుల గడువుకు ముందే రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్నాం.

– నిషాంత్ కుమార్,
కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

వీరఘట్టంలో రియల్ దందా..!



పంట పొలాలకు వెళ్లే కాల్వను, పక్కనే ఆర్‌అండ్‌బీ స్థలంలో ఉన్న చెట్టు కొట్టేసి కప్పేసిన ఆక్రమణదారులు


- ఆర్‌అండ్‌బీ పరిధిలోని చెట్లు కొట్టేసి... పంట కాల్వలు కప్పేసిన వైనం
- నాలా కన్వర్షన్ లేకుండానే చదును చేసిన పంట పొలాలు
- పక్కనే ఉన్న డి పట్టా భూముల్లో కూడా వెంచర్లు వేసే యత్నం
- పక్కనే ఉన్న ప్రభుత్వ పోరంబోకును కబ్జా చేసేందుకు పన్నాగం
- చర్యలకు స్థానికుల డిమాండ్
- కన్నెర్ర జేసిన రెవెన్యూ అధికారులు

వీరఘట్టం: వీరఘట్టం మేజరు పంచాయతీలో కొంత కాలంగా రియల్ దందా ఊపందుకుంది. పార్వతీపురం మన్యం జిల్లా కొత్తగా ఏర్పడిన తర్వాత వీరఘట్టం పట్టణంలో భూముల ధరలు అమాంతంగా మూడు రెట్లు పెరిగాయి. జిల్లా కేంద్రానికి పాలకొండ డివిజన్ కేంద్రానికి సెంటర్‌లో వీరఘట్టం పట్టణం ఉండడంతో ఇక్కడ భూముల ధరలు అమాంతంగా పెరిగాయి. ఇదే అదనుగా చేసుకుని కొందరు వ్యక్తులు రియల్ ఎస్టేట్ పేరుతో డి - పట్టా భూముల్లో వెంచర్లు వేశారు. అంతేకాక ఆ పక్కనే ఉన్న ప్రభుత్వ పోరంబోకు భూమిని కూడా కబ్జా చేసేందుకు పన్నాగం పన్నారు. విషయం బయటకు పొక్కడంతో రెవెన్యూ అధికారులు కన్నెర్రజేశారు. నాలా కన్వర్షన్ లేకుండా చదును చేసిన పొలాల్లో ఉన్న బోర్డులు, కొలత రాళ్లను తొలగించారు. వివరాల్లోకి వెళ్తే...

వీరఘట్టం పట్టణానికి తూర్పున పాలకొండ రోడ్డులో సర్వే నంబరు 214లో ఉన్న 0.41 ఎకరాల భూమి, 215లో ఉన్న 1.22 ఎకరాల భూమి, 216లో ఉన్న రెండెకరాల భూమితో కలిపి మొత్తం 3.63 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వేసేందుకు కొందరు ఇటీవల ఆ భూమిని చదును చేసి వెంచర్లు వేశారు. 15''50 కొలతలతో ఉన్న స్థలం రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు విక్రయించేందుకు వెంచర్లు వేశారు. రోడ్డు పక్క భూమి కావడంతో డిమాండ్ బాగా పెరిగింది. దీంతో చాలా మంది ఈ వెంచర్లు కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. ఇదే అదునుగా చేసుకుని ప్రస్తుతం ఈ వెంచర్లలో స్థలాన్ని రెండింతలు పెంచేసి విక్రయించాలని వ్యాపారులు తెగబడుతున్నారు.

ప్రభుత్వ పోరంబోకు కబ్జా చేసే యత్నం

వీరఘట్టం పట్టణ పరిధిలో ఉన్న సర్వే నంబర్లు 214, 215, 216లలో రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ భూమిలో ఉన్న పంట పొలాలకు వెళ్లే కాల్వలను కప్పేసి, రోడ్డు పక్కన ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న చెట్లు కొట్టేసి ఇటీవల కొందరు వ్యాపారులు వెంచర్లు వేశారు. ఆ పక్కనే ఉన్న సర్వే నంబరు 214లో ఉన్న 0.40 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా చదును చేశారు. అంతే కాకుండా ఇదే సర్వే నంబర్‌లో ఉన్న మరో 0.97 ఎకరాల డి - పట్టా భూములను కూడా చదును చేసి వెంచర్లుగా మార్చేందుకు ఎత్తుగడ వేశారు.



పంట పొలాల్లో వేసిన వెంచర్ల నమూనా

నాలా కన్వర్షన్ లేకుండానే..

ఒక పంట పొలాన్ని వెంచర్లుగా వేయాలంటే నాలా(నాన్ అగ్రికల్చర్ ల్యాండ్) కన్వర్షన్ చేయించాలి. అందుకు ప్రభుత్వానికి తగిన ఆధారాలు చూపించి నాలాకు దరఖాస్తు చేయాలి. ఆ దరఖాస్తును పరిశీలించిన పిమ్మట సబ్ కలెక్టర్ నాలాను ధ్రువపరుస్తారు. అప్పుడు ఆ భూమిని మనకు కావాల్సిన విధంగా చదును చేసుకోవచ్చు. ఇక్కడ మాత్రం నాలా కన్వర్షన్ జరగక ముందే నిబంధనలకు విరుద్ధంగా కొందరు వ్యాపారులు పంట పొలాలను చదును చేసి, పంట కాల్వలను కప్పేసి రియల్ వ్యాపారానికి తెర తీశారు. అంతేకాకుండా పక్కనే ఉన్న డి -పట్టా భూములను కూడా చదును చేశారు. ఆ పక్కనే ఉన్న ప్రభుత్వ పోరంబోకు భూమిని కూడా చదును చేసి ఆక్రమించే యత్నం చేస్తున్నారు.

హద్దు మీరితే చర్యలు

నాలా కన్వర్షన్ లేకుండా పంట పొలాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే చర్యలు తప్పవు. ఇటీవల వీరఘట్టం పట్టణానికి శివారులో పంట పొలాల్లో వెంచర్లు వేస్తున్నట్లు సమాచారం రావడంతో ఇక్కడ వేసిన కొలరాళ్లను మా సిబ్బంది తొలగించారు. నాలా కన్వర్షన్ జరిగిన తర్వాత మాత్రమే పంట పొలాలను చదును చేసుకోవాలి. అలాగే డి – పట్టా భూముల్లో, ప్రభుత్వ పోరంబోకు భూములు ఆక్రమించి వెంచర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– జల్లేపల్లి మాధవి,తహసీల్దార్, వీరఘట్టం

'దిశ'తో సత్వర న్యాయం

- ప్రజలకు చట్టాలపై అవగాహన అవసరం
- అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సౌజన్య

పార్వతీపురం టౌన్‌: విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరని రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా కౌన్సిల్ చైర్మన్ ఎస్.దామోదర రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని బెలగాంలో అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య, కొత్తవలస నవిరి కాలనీలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్ ప్రజలకు దిశ స్కీంపై న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ఏర్పడిన దిశ చట్టం ద్వారా సత్వర న్యాయం అందుతుందన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఇప్పటికీ అమలు చేస్తున్నప్పటికి సకాలంలో సత్వర న్యాయం అందించేందుకు ఈ చట్టాన్ని రూపకల్పన చేశారన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. పేదలకు, గిరిజనులకు, దళితులకు, పేద దివ్యాంగులకు ఉచిత న్యాయసేవలను అందిస్తున్నామన్నారు. వార్షిక ఆదాయం రూ.3లక్షల లోపు ఉన్నవారికి ఉచిత న్యాయం అందిస్తామన్నారు. పేదవారంతా ఉచితంగా న్యాయ సలహాలు తీసుకోవచ్చునని తెలిపారు. గృహహింస, వరకట్న వేధింపులు, భ్రూణహత్యలు, బాలికల వేధింపులపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. దివ్యాంగులంతా తమకు కావల్సిన న్యాయ సలహాలు కోసం ఎంఎల్ఎస్‌సీని ఆశ్రయించవచ్చునన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు టి.జోగారావు, జి.వెంకటరావు, దిశ పీఎస్ ఎస్ఐ సంతోషి, ఏఎల్‌ఓ సీహెచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య

వేణుగోపాలుడికి నవనీత సేవ



పట్టణంలోని ప్రముఖ దేవాలయం వేణుగోపాల స్వామికి నవనీత సేవ, పుష్పయాగాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన రకరకాల పూలతో ఆలయాన్ని అందంగా అలంకరించారు. నవనీత సేవను గతంలో ఎన్నడూ జరగని రీతిలో నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

-బొబ్బిలి

చలి పులి

మన్యం జిల్లా ప్రజలను చలి పులి వణికిస్తోంది. పంజా విసిరి తన ప్రతాపాన్ని చూపిస్తోంది. సాయంత్రం నుంచే ప్రారంభమవుతున్న చలి గాలులు ఉదయం 9 గంటల వరకు కొనసాగుతూ గజగజలాడిస్తున్నాయి.



సంగంవలసలో కురుస్తున్న పొగ మంచు

- విస్తారంగా కురుస్తున్న పొగ మంచు
- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- జనం గజగజ

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో చలి తీవ్రత ఎక్కువైంది. సాయంత్రం 5 గంటల నుంచే చలి గాలులు వీస్తున్నాయి. ఉదయం 8 వరకు పొగ మంచు వీడడం లేదు. ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు రావాలంటే వణుకుతున్నారు. మంచు కురిసే సమయంలో ప్రకృతిలోని కొత్త అందాలను ప్రకృతి ప్రియులు ఆస్వాదిస్తున్నారు. చలి కాలంలో ఆరోగ్యపరంగా పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వణుకుతున్న చిన్నారులు, వృద్ధులు చలి తీవ్రత కారణంగా పలు గ్రామాల్లో ఉదయం 8 గంటల వరకు సూర్యుడు కనిపించడం లేదు. గడిచిన రెండు రోజులుగా చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఉదయం 9 గంటలైనా చలి తీవ్రత తగ్గడంలేదు. ఈ కారణంగా ప్రజలు ఉదయం పనులకు వెళ్లాలంటే వణుకుతున్నారు. ఏజెన్సీలో గత ఏడాది డిసెంబర్ మొదటి వారం నుంచే చలి తీవ్రత ఎక్కువగా ఉంది. దానితో వృద్ధులు, చిన్నారులతో పాటు శ్వాసకోశ, ఆస్తమా, ఊపిరితిత్తులు సంబంధిత రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

చలి ప్రభావానికి ముందుగా దెబ్బతినేది చర్మం. చలి తాకిడి ఎక్కువైనప్పుడు చర్మంపై పగుళ్లు ఏర్పడతాయి. చర్మం పొడిబారి పోకుండా మాయిశ్చరైజర్‌ని చేసుకోవాలి. గోరువెచ్చని నీటితో స్నానం చేయడం మంచిది. కెమికల్స్ సోప్స్ కాకుండా మైల్డ్ సోప్స్ వాడాలి. చేతులు, కాళ్లు చలికి ఎక్కువగా పగులుతాయి. తాజా పండ్ల రసాలు, మంచినీటిని తాగితే మంచిది. చలి గాలులు తగలడం వల్ల చర్మ వ్యాధులు, ఆస్తమా, గుండె జబ్బులు, చెవి, ముక్కు, గొంతు నొప్పులు వచ్చే ప్రమాదం ఉంది. చిన్న పిల్లలకు చెవిపోటు, గొంతునొప్పి, జలుబు వంటి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. వాకింగ్‌కు బయలుదేరేటప్పుడు తేలికపాటి వ్యాయామం చేయాలి.

ప్రాథమిక దశలోనే సంప్రదించాలి

జలుబు, దగ్గు, చలి జ్వరం, గొంతునొప్పి వంటి రుగ్మతలు వచ్చినప్పుడు ప్రాథమిక దశలోనే వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి. చిన్నారులు, వృద్ధులు, డయాబెటిక్ రోగులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి ఇవి ప్రాణాంతకంగా పరిణమిస్తాయి. న్యూమోనియా, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులకు గురై ప్రాణాపాయ స్థితికి చేరుకుంటారు.

తగు జాగ్రత్తలతో...



పొగమంచు వల్ల జలుబు, జ్వరంతో పాటు న్యుమోనియా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఊపిరితిత్తులు, చర్మవ్యాధులు రావచ్చు. 20 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైతే రోగాలు వ్యాపిస్తాయి. బయట తిరిగే వ్యక్తులు తల, శరీరం కప్పి ఉంచేలా ఉన్ని దుస్తులు ధరించాలి. ప్రతి ఒక్కరూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఆహార నియమాలు పాటించాలి. కూల్ డ్రింక్‌లు, ఐస్‌క్రీంలు తీసుకోవద్దు.

డా. కె.కె.సాగర్,
వైద్యాధికారి, పీహెచ్‌సీ గరుగుబిల్లి

క్లుప్తంగా

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

రాజాం సిటీ: మండల పరిధి మారెడుబాక గ్రామసమీపంలోని మామిడితోటలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేశామని ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి పట్టుకుని వారి నుంచి రూ.48,280 స్వాధీనం చేసుకోవడంతో పా టు కేసు నమోదుచేశామని చెప్పారు. గ్రామా ల్లో పేకాట శిబిరాలు నిర్వహించవద్దని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళా దొంగ..

విజయనగరం క్రైమ్: ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగ్‌ను చోరీ చేసిన మహిళా దొంగను వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ జి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. పద్మనాభం మండలానికి చెందిన కె.సన్యాసమ్మ బట్టల వ్యాపారం నిమిత్తం విజయనగరం బాలాజీ మార్కెట్‌కు వచ్చింది. రైల్వేస్టేషన్‌రోడ్డులో దిగిన తరువాత తన బ్యాగ్‌లో ఉన్న రూ.50వేల నగదు మాయమైనట్లు గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు కన్యకాపరమేశ్వరి కోవెల వద్ద సీసీ కెమెరాల ఆధారంగా నిందితురాలిని గుర్తించారు. ఆమెను ఎల్.కోట మండలం రంగాపురానికి చెందిన దాసు యేసుమణిగా తెలుసుకుని అదుపులోకి విచారణ చేసి ఆమె నుంచి రూ.48 వేలు స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

జామి: మండలంలోని అలమండ గ్రామానికి చెందిన మాకిరెడ్డి అప్పారావు (46) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీలో మెకానిక్‌గా పనిచేసే అప్పారావు మద్యానికి బానిసై విధులకు కొంత కాలంగా వెళ్లక పోవడంతో ఆర్థికంగా చితికిపోయాడు. దీంతో మనస్తాపం చెంది శనివారం తన ఇంటి మేడమీద పురుగు మందు తాగేశాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కోనాడ తీరంలో మృతదేహం లభ్యం

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ సముద్రతీరంలో ఆదివారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. చీపురుపల్లి మండలం కొత్తఅగ్రహారానికి చెందిన కాసా శ్రీనివాసరావు (20) ఈనెల 4 వతేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి బంధువులు అచూకీ కోసం వెతుకుతుండగా ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో కోనాడ సముద్రతీరంలో విగతజీవిగా ఒడ్డుకు కొట్టుకొచ్చాడు. మృతుడు శ్రీనివాసరావుకు ఉద్యోగం లేకపోవడంతో కొంతకాలంగా బాధపడుతున్నట్లు బంధువులు తెలిపారు.. తల్లిదండ్రులను పోషించాల్సిన సమయంలో వారికి భారమయ్యానని మనస్తాపం చెంది సముద్రంలో దూకి ఉండవచ్చని చెప్పారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి సుందరపేట ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

ఎస్సీ కమిషన్ ద్వారా పలు సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీకమిషన్ సభ్యురాలు ఎస్ జయమణి

సీతానగరం: ఎస్సీ కుటుంబాలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నియమించిన ఎస్సీ కమిషన్ ద్వారా పరిష్కరిస్తున్నట్లు రాష్ట్ర ఎస్సీకమిషన్ సభ్యురాలు సవరపు జయమణి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ చైర్మన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఐదుగురు సభ్యులు సమన్వయంతో రాష్ట్రంలో ఎస్సీకుటుంబాలవారికి కమిషన్ ద్వారా సేవలందిస్తున్నామని తెలియ జేశారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని పలుగ్రామాల్లో పర్యటించి ఎస్సీ కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను పెద్దలసమక్షంలో, లేదా న్యాయపరంగా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. తాను ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులతో పాటు పార్వతీపురం ఎమ్మెల్యేగా సేవలందించానని, జగనన్న ప్రభుత్వం తనసేవలను గుర్తించి రాష్ట్ర ఎస్సీకమిషన్ సభ్యురాలిగా నియమించినట్లు తెలియజేశారు. భవిష్యత్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎటువంటి బాధ్యతలు అప్పగించినా పార్టీ కోసం పని చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్ రామారావు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

వెదురుతో ఆదరువు

- చేతిపనికి సాంకేతికత జోడింపు
- రాజాం జీఎంఆర్ఐటీ ఆధ్వర్యంలో శిక్షణ
- ఏడాది కాలంగా తర్ఫీదు
- వెదురుకర్రలతో బుట్టలు, పెన్‌స్టాండ్స్, ఫ్లవర్ బొకేల తయారీ



సీడ్ ప్రాజెక్ట్ ద్వారా జరుగుతున్న శిక్షణ కార్యక్రమం



అందమైన బొకేలు



పూల కూజాలు



ఆకర్షణీయమైన వస్తు సామగ్రి



టేబుల్ డెకరేషన్ వస్తువు

రాజాం: వెదురుకర్రతో తయారు చేసిన బుట్టలు అందరికీ తెలిసినవే. వెదురు కర్ర తట్టల గురించి చెప్పనక్కర్లేదు. సాధారణంగా ఇవన్నీ ఎప్పటినుంచే గ్రామీణ ప్రాంతాల్లో చూస్తున్న వస్తుసామాగ్రే. అయితే వాటికి భిన్నంగా ఇదే ముడిసరుకుతో మరెన్నో వస్తువులు కూడా తయారుచేసి ఇంట్లో అందంగా అలంకరించుకోవచ్చు. స్నేహితులకు బహుమతిగా ఇవ్వొచ్చు. కాస్తా సాంకేతికత తోడైతే చాలు ఇదే వెదురుకర్ర ఎన్నో అద్భుతాలు సృష్టిస్తుందని రాజాం పట్టణానికి చెందిన జీఎంఆర్ఐటీ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం నిరూపిస్తోంది. గత ఏడాది కాలంగా రాజాం చుట్టపక్కల గ్రామాలకు చెందిన వెదురుపనివారికి వెదురుతో తయారు చేసే అందమైన వస్తుసామగ్రిపై శిక్షణ ఇస్తున్నారు.

ప్లాస్టిక్ నిషేధమే లక్ష్యంగా..

న్యూఢిల్లీకి చెందిన సైన్స్ ఫర్ ఈక్యూటీ ఎంపవర్ అండ్ డెవలప్‌మెంట్ డివిజన్ (సీడ్) ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు ప్రారంభించింది. ప్రజలు వినియోగించే నిత్యావసర వస్తుసామగ్రిలో కొన్నింటిని ప్లాస్టిక్ నుంచి దూరంచేసేందుకు చేతితో తయారీచేసే వస్తుసామగ్రిపై దృష్టిసారించింది. ఓ వైపు ప్లాస్టిక్‌ను నివారించేందుకు వెదురుపుల్లలతో తయారుచేసే వస్తుసామగ్రిని ప్రోత్సహించడం, మరో వైపు వాటిని తయారీచేసే కులవృత్తుల చేతిపనివారికి సాంకేతికత అందించి వారి జీవన నైపుణ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా చేసుకుంది. దేశంలోని పలు ఐటీ కళాశాలల్లో చేతి వృత్తుల వారికి సాంకేతిక నైపుణ్యాలు అందించే కార్యక్రమాలు చేపట్టగా రాజాంలోని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏడాది క్రితం ఒక ప్రాజెక్ట్ ప్రారంభించింది. వెదురుకర్రలు, పుల్లలతో తయారయ్యే వస్తుసామగ్రిని మరింత అందంగా తయారీచేసే విధానాన్ని చేతిపనివారికి నేర్పుతోంది.

శిక్షణకు విశేష ఆదరణ

జీఎంఆర్ఐటీ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జరుగుతున్న సాంకేతిక శిక్షణకు విశేష ఆదరణ కనిపిస్తోంది. ప్రస్తుతం రాజాం, సంతకవిటి, రేగిడి, జి.సిగడాం తదితర మండలాలకు చెందిన వెదురు పనివారు ఈ శిక్షణ వినియోగించుకుంటున్నారు. ఇప్పటివరకూ 150 మంది శిక్షణ పొందారు. ఒక వ్యక్తికి 25 రోజులు శిక్షణ ఇస్తుండగా, శిక్షణ సమయంలో రోజుకు రూ. 200లు స్టైపెండ్ ఇస్తున్నారు. శిక్షణ బాగా సద్వినియోగం చేసుకున్నవారు సొంతంగా మెషీన్లు కొనుగోలుచేసేవిధంగా బ్యాంకు రుణాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈశిక్షణను పూర్తిగా వెదురుపని తెలిసిన శిక్షకుల ద్వారా ఇప్పించడంతో పాటు శిక్షణలో మెలకువలు నేర్చుకుని, బాగా వస్తుసామగ్రి తయారు చేస్తున్నవారితో కూడా కొత్తవారికి శిక్షణ ఇప్పిస్తున్నారు. సీడ్ ప్రాజెక్టులో భాగంగా తయారీచేస్తున్న వెదురు వస్తుసామగ్రి చాలా అందంగా, అపురూపంగా దర్శనమిస్తోంది. టీ, కాఫీ కప్పులు, ట్రేలు, సజ్జలు, ఫ్లవర్ బొకేలు, కూజాలు, దుస్తులు పెట్టే తొట్టెలు, చిన్నారుల ఊయల తొట్టెలు, పెన్నుల స్టాండ్‌లు, బట్టల స్టాండ్‌లు ఇలా వినూత్న వస్తుసామాగ్రి రూపొందుతోంది. ఇవన్నీ ప్లాస్టిక్ రహిత వస్తుసామగ్రి కావడంతో పాటు పర్యావరణ హితమైనవి. ఎటువంటి విద్యార్హత లేకున్నా వెదురుపనితెలిసి, 18 నుంచి 45 సంవత్సరాలలోపు ఉన్నవారు ఇక్కడికి శిక్షణకు వచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు.



వెదురుతో తయారు చేసిన వస్తువులు

ప్రాజెక్ట్ వివరాలిలా..

ప్రాజెక్ట్ పేరు	: సీడ్(సైన్స్ ఫర్ ఈక్యుటీ ఎంపవర్ అండ్ డెవలప్‌మెంట్ డివిజన్)
పర్యవేక్షణ	: జీఎంఆర్ఐటీ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం
కేటాయించిన నిధులు	: 1.59 కోట్లు
శిక్షణ పొందేవారు	: వెదురుపనివారు
లబ్ధిపొందే వారు	: ఎస్సీఎస్టీ కులాలకు చెందిన 800 కుటుంబాలు
ఒక వ్యక్తికి శిక్షణకాలం	: 25 రోజులు
ఉపయోగించే ముడిసరుకు	: వెదురుకర్రలు
తయారీచేసేవి	: పెన్‌స్టాండ్‌లు, ఫ్లవర్‌బొకేలు, కూజాలు, తొట్టెలు
ఉపయోగించే యంత్రాలు	: 23
ప్రాజెక్ట్ కాలం	: 3 సంవత్సరాలు

చాలా మంచి ప్రాజెక్ట్



చేతివృత్తి చేసుకునే వారిలో నైపుణ్యం మెరుగుపరిచేందుకు, వారికి సాంకేతికత అందించేందుకు సీడ్ సాయంతో వెదురుపని చేసే చేతివృత్తుల వారికి శిక్షణ శిబిరం ఏర్పాటుచేశాం. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లోని వెదురు పనివారికి అవకాశం కల్పిస్తున్నాం. ఇప్పటివరకూ 150 మంది శిక్షణ పొందారు.

– డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్ ఇన్విస్టిగేటర్, జీఎంఆర్ఐటీ, రాజాం.

విడతల వారీగా..



జీఎంఆర్ఐటీ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాల్లో భాగంగా చేతివృత్తుల వారికి సాంకేతికతను అందిస్తున్నాం. ఓ వైపు చేతివృత్తుల వారికి మెలకువలు నేర్పడంతో పాటు మరో వైపు ప్లాస్టిక్ వస్తుసామగ్రి వినియోగం తగ్గించడం లక్ష్యంగా ఈకార్యక్రమం జరుగుతోంది. ఒక బ్యాచ్‌కి 20 మంది వరకూ శిక్షణ ఇస్తున్నాం. విడతల వారీగా, వెదురుపనివారికి ఖాళీగా ఉన్న సమయంలో ఈ శిక్షణ ఇస్తున్నాం.

– డాక్టర్ పీఎస్ఎల్ పావని, కో ప్రిన్సిపాల్ ఇన్విస్టిగేటర్, జీఎంఆర్ఐటీ

ఆయిల్ పామ్‌తో అధిక ఆదాయం

- జిల్లాలో విస్తరిస్తున్న సాగు
- ఎకరాకు 8నుంచి10టన్నుల దిగుబడి రావడంతో రైతుల ఆసక్తి



గరివిడి మండలంలో పంటదశకు వచ్చిన పామాయిల్ గెలలు



గరివిడి మండలంలో సాగు చేస్తున్న పామాయిల్



గజపతినగరం మండలంలో పామాయిల్ సాగు

గజపతినగరం: విజయనగరం జిల్లాలో ఆయిల్ పామ్‌ను సాగు చేస్తున్న ఎంతో మంది రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో సుమారు ఆరు వేల ఎకరాల్లో ఆయిల్ పామ్‌ను సాగు చేస్తున్నారు. ఎస్.కోట, బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి మండలాల్లో పూర్వకాలం నుంచి ఆయిల్‌పామ్‌ను సాగు చేసుకుంటూ సుస్థిర అభివృద్ధిని సాధిస్తున్నారు. ఈ అభివృద్ధిని గమనించిన గజపతినగరం, నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ తదితర మండలాల్లో కూడా ఆయిల్ పామ్ సాగు చేపట్టడంతో జిల్లాలో అంచెలంచెలుగా ఆయిల్ పామ్ సాగు విస్తరిస్తోంది. ఆయిల్‌పామ్ తోటలను మెట్ట ప్రాంతాల్లోని అన్నిరకాల నేలల్లో సాగు చేయవచ్చు. నీరు నిలిచే ప్రదేశాల్లో సాగు చేయకుండా నీరు తేలికగా ఇంకిపోయే ప్రదేశాల్లో ఆయిల్ పామ్‌ను సా గు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు.

వాతావరణం ఇలా ఉండాలి

అధిక ఉష్ణోగ్రత 29 డిగ్రీల నుంచి 33 డిగ్రీలు, అల్ప ఉష్ణోగ్రత 22నుంచి 24డిగ్రీల సెల్సియస్ ఉన్న అనువైన ప్రదేశాల్లో సాగు చేస్తే అనుకున్న దిగుబడులు సాధించవచ్చు. రైతులు భూపరీక్ష చేయించుకుని వాటి ఫలితాలను బట్టి సాగు చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఎక్కువగా నూనె దిగుబడిని ఇచ్చే టెనేరా హైబ్రిడ్ మొక్కకు మూడు సంవత్సరాల కాలవ్యవధి నుంచి దిగుబడి మొదలవుతుండడంతో రైతులు అధిక సంఖ్యలో ఆయిల్ పామ్ సాగుపై ఆధారపడుతున్నారు.

సాగులో జాగ్రత్తలు

- పామాయిల్ సాగుపై ఆసక్తి చూపే రైతులు నర్సరీలో బాగా పెరిగిన 10నుంచి16 నెలల వయస్సు గల మొక్కలను నాటుకోవడానికి ఎంచుకుంటే మంచిది.
- మొక్కలను నాటుకోవడానికి ముందుగా నేలను రెండు మూడు సార్లు నేల గుల్ల బారేలా దున్నాలి.
- పామాయిల్ మొక్కలు నాటిన వెంటనే పాదు నిండా నీరు ప్రతిరోజూ పెడితే అధిక దిగుబడులు సాధించే అవకాశాలు ఉన్నాయి.
- ఎకరా పొలంలో 8నుంచి10టన్నుల దిగుబడులు రావడంతో జిల్లాలో అధిక సంఖ్యలో పామాయిల్ తోటలను రైతులు సాగుచేస్తున్నారు.
- డ్రిప్ ఇరిగేషన్ ద్వారా అధిక మోతాదులో రోజూ 200నుంచి300 లీటర్ల నీటి తడులు రైతులు ఇస్తే అనుకున్న దిగుబడులు సాధించవచ్చు.
- మూడు సంవత్సరాల నుంచి 30ఏళ్ల వరకు పామాయిల్ ఆదాయం ఇచ్చే వనరుగా పేరు పొందడంతో రైతులు పండించేందుకు ముందుకు వస్తున్నారు.

30ఏళ్ల వరకు సుస్థిరంగా ఆదాయం



కొన్నేళ్లుగా విజయనగరం జిల్లాలో రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేస్తూ వస్తున్నారు. 30ఏళ్ల వరకు సుస్థిరంగా ఇచ్చే ఆదాయ వనరు ఇది. మొక్కకు 200 నుంచి 300 లీటర్ల వరకు రోజువారి నీటి తడులు పెట్టి నత్రజని, బాస్వరం అందిస్తే గణనీయమైన దిగుబడులు సాధించవచ్చు. – డాక్టర్.కె.తేజేశ్వరరావు (జిల్లా ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్ర వేత్త)

రైలులో మర్చిపోయిన బ్యాగ్ అప్పగింత

- బ్యాగ్‌లో బంగారు వస్తువులు



చైన్‌ను కాసులమ్మకు అప్పగిస్తున్న రైల్వే సిబ్బంది

పార్వతీపురం టౌన్: విజయవాడ నుంచి పార్వతీపురం వచ్చిన కోల కాసులమ్మ ఆదివారం రైల్లో మరిచిపోయిన బ్యాగ్‌ను జీఆర్‌పీ, రైల్వే సిబ్బంది ఆమెకు అప్పగించారు. ఈ సందర్భంగా స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బొకారో ఎక్స్‌ప్రెస్‌లో కాసులమ్మ బ్యాగ్ మరిచిపోయిందని పార్వతీపురం స్టేషన్ నుంచి అందుకున్న సమాచారం మేరకు జీఆర్‌పీ సిబ్బందికి తెలియజేశామన్నారు. వెంటనే స్పందించిన జీఆర్‌పీ సిబ్బంది పార్వతీపురం టౌన్‌స్టేషన్‌లో రైలులో తనిఖీ చేసి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని ఆమెకు అప్పగించినట్లు తెలిపారు. ఆ బ్యాగ్‌లో రూ.1.50లక్షల విలువచేసే మూడు తులాల బంగారం చైను, రూ. 5 వేల విలువచేసే వస్తువులు ఉన్నట్లు చెప్పారు. బ్యాగ్‌ను అప్పగించడంతో రైల్వేసిబ్బందికి కాసులమ్మ కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ తనిఖీల్లో జీఆర్‌పీ హెచ్‌సీ రత్నకుమార్, సీతంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వరంగంలోనే బ్యాంక్‌ల పరిరక్షణ సాధ్యం



ఉద్యమ ఐక్యతను తెలియజేస్తున్న బ్యాంకింగ్ ఉద్యోగులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ రంగంలో ఉంటేనే బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్టంగా ఉంటుందని, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని ఏఐబీఈఏ, బ్యాంక్స్ ఎంప్లాయీస్ కో ఆర్డినేట్ కమిటీ విజయనగరం ప్రెసిడెంట్ బీవీప్రసాద్, సెక్రటరీ మురళీ శ్రీనివాస్‌లు అన్నారు. ఈ మేరకు స్థానిక అమర్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగాన్ని ప్రైవేటీకరణ పేరుతో నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. మొన్నటి వరకు లాభాల్లో ఉన్న ఎల్ఐసీని ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్రం ప్రయత్నం చేస్తోందని ఇందులో భాగంగానే ప్రభుత్వ వాటాను కొంతమేరకు ఉపసంహరించుకుందని విమర్శించారు. రుణ ఎగవేతదారులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని అటువంటి వారి నుంచి వెంటనే మొత్తం రుణాన్ని వసూలు చేస్తే ఏ ప్రభుత్వ రంగ బ్యాంకు కూడా నష్టాల్లో ఉండదని అభిప్రాయ పడ్డారు. బ్యాంకులు నష్టాల్లో కూరుకు పోవడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమని ఆరోపించారు. బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలను త్వరితగతిన పరిష్కరించకపోతే ఏఐబీఈఏ ఆధ్వర్యంలో మరిన్ని పోరాటాలు చేసి సాధించుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం పోరాటాల ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బుగత అశోక్, బ్యాంక్ ఎంప్లాయిస్ సంఘం సభ్యులు శ్రావణ్‌కుమార్, రవికుమార్, శ్రీనివాస్‌శర్మ, భానోజీరావు, మనోజ్ కుమార్, వెంకటాచలం, నాగభూషణం, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పెదపోలమ్మ పండగకు సర్వం సిద్ధం

- నేటి నుంచి మూడు రోజుల పాటు సంబరాలు
- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పల నాయుడు పర్యవేక్షణలో ఏర్పాట్లు
- 9న తొలేళ్ల ఉత్సవం, 10న సిరిమానోత్సవం



సిరిమాను సిద్ధం చేస్తున్న దృశ్యం



ఉత్సవాలకు ముస్తాబైన పెదపోలమ్మ ఆలయం

బొబ్బిలి రూరల్: పెదపోలమ్మ సంబరాలకు మండలంలోని పక్కి గ్రామం సిద్ధమైంది. సోమవారం నుంచి దాదాపు మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఐదేళ్లకు ఒకసారి చేపట్టే ఈ వేడులను చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల వారు తహతహలాడుతుంటారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు స్వగ్రామం పక్కిలోనే ఈ పండగ జరుగుతుండడంతో ఈ ఏడాది పండగ ఎలా చేస్తారా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తుండడం విశేషం. ఎమ్మెల్యే, ఆయన సోదరుడు వేణుగోపాలనాయుడు ప్రస్తుతం పండగ ఏర్పాట్లను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. సోమవారం తొలేళ్ల ఉత్సవంతో ఆరంభమయ్యే అమ్మవారి సంబరాలు మంగళవారం సిరిమానోత్సవం బుధవారం అనుపోత్సవంతో ముగుస్తుంది. ఆయా రోజుల్లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, తమ మొక్కులు తీర్చుకుంటారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటాయి. ప్రధానంగా అంజలి రథం, బళ్ల వేషాలు చూపరులను అలరిస్తాయి.

అమ్మవారి దీవెనలతో..



పెదపోలమ్మ వారి దీవెనలతో ప్రతీసారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం. ప్రజాప్రతినిధులు, పోలీసులు, గ్రామస్తుల సహకారం చాలా బాగుంటుంది. అమ్మ వారి సిరిమాను అధిరోహించడం నా పూర్వ జన్మ సుకృతం. ఈ ఏడాది కూడా ఉత్సవాలు బాగా జరిగేలా అమ్మవారు దీవిస్తారు. – నక్కా పకీరు, సిరిమాను అధిరోహించే పూజారి, పక్కి